వడ్డెరుల సమస్యలు పరిష్కరించాలి

చిక్కడపల్లి: వడ్డెరులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని వడ్డెర సంఘం నాయకులు కోరారు. గురువారం ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జెరిపిటి జైపాల్ ఆధ్వర్యంలో వడ్డెర సంఘం నాయకులు గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వడ్డెర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించి పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు జెరిపేటి సత్యనారాయణరాజు, తెలంగాణ గన్ను దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తిరి అంతయ్య, వడ్డెర సఘం ముఖ్య ముఖ్య సలహాదారుడు కృష్ణయ్య, మల్లెపు లక్ష్మీనారాయణ, సంపంగి రమేష్, సతీష్, గణేష్, శివరాత్రి అంజయ్య, గిరి తదితరులు పాల్గొన్నారు.

ధర్మ రక్షణకు కృషి చేయాలి

ముషీరాబాద్: దేశం కోసం ధర్మం కోసం హిందువులంతా సంఘటితం కావాలని హిందూ వాహిని రాష్ట్ర నాయకులు రాధా మనోహర్‌దాస్ అన్నారు. గురువారం హిందూవాహిని ఆధ్వర్యంలో ముషీరాబాద్‌లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాధా మనోహర్ దాస్ మాట్లాడుతూ.. యువత దేశ రక్షణ కోసం సైనికుల్లా పని చేయాలన్నారు. హిందూ ధర్మాన్ని పరిరక్షించేందుకు ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బబ్లూ, ఎం.నవీన్‌గౌడ్, వినయ్‌కుమార్, గడ్డం నవీన్‌కుమార్, సూర్య, విక్రమ్, సురేష్, ఆదిత్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలి

చిక్కడపల్లి: జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షుడు మామిడి సోమయ్య ప్రభుత్వాన్ని కోరారు. గురువారం త్యాగరాయ గానసభలో జరిగిన ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య, కోశాధికారి రాచమల్ల వెంకటేశ్వర్లు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ నిర్ణయం హర్షణీయం

ముషీరాబాద్: పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు ఫీజులో 25 శాతం రాయితీ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తెలంగాణ రియాల్టర్స్ అసోసియేషన్ స్వాగతిస్తోందని అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.నరసయ్య పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ లేఅవుట్లలోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఇది ఒక సదావకాశమని అన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించడానికి తుది గడువును మార్చి 31గా కాకుండా మరోక నెల పాటు పొడిగించాలన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు కాకునూరు సుధాకర్, విక్రం, రాకేష్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్వీ వేడుకలు

ముషీరాబాద్: పఠాన్ బస్తీలో గురువారం గ్యార్వీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సంఘ సేవకుడు నూర్‌ఉద్దీన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకు ముందు ముస్లింలతో కలిసి సామూహిక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు జాఫర్, షాహెద్, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

చెట్లకొమ్మల తొలగింపు

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్‌లోని జెమినీకాలనీ, గంగపుత్రకాలనీలో చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు అనుకుని ప్రమాదంగా ఉన్నాయి. ఈ విషయాన్ని బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పూస గోరఖ్‌నాథ్ గురువారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో జెమినీకాలనీలో ప్రమాదంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. డివిజన్‌లోని వివిధ ప్రాంతాలలో విద్యుత్ తీగలకు అనుకుని ప్రమాదంగా మారిన చెట్ల కొమ్మలను సైతం తొలగించాలని గోరఖ్‌నాథ్ అధికారులను కోరారు.

రోడ్డు పనుల పరిశీలన

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్‌లోని దాయార మార్కెట్ వీధి, పఠాన్‌బస్తీలో మెరుగైన తాగునీటి సరఫరా, రోడ్ల ఆధునీకరణకు చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ అన్నారు. గురువారం దాయార మార్కెట్ వీధిలో రోడ్ల నిర్మాణ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంచి కుమార్‌ముదిరాజ్ కార్పొరేటర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిల్‌కుమార్, అజయ్‌గుప్తా, రాజు, గిరి పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని వ్యక్తి (50) అనారోగ్యంతో రైల్వేస్టేషన్ సమీపంలో చనిపోయి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.


చే నంబర్ చౌరస్తాలో గుంతల మయంగా మారిన రోడ్డు


గోల్నాక ఫ్లైఓవర్ కింది సర్వీస్ రోడ్డు


సుందరనగర్ బస్టాప్‌లో పార్కింగ్.. రోడ్డుపై ప్రయాణికులు


కాచిగూడ విద్యుత్ శ్మశానవాటిక రోడ్డు

ఈ దారి.. గుంతలదారి..!

- అధ్వానంగా కాచిగూడ – అంబర్‌పేట జాతీయ రహదారి
- పట్టించుకోని రోడ్లు, భవనాల శాఖ అధికారులు
- కనీసం ప్యాచ్‌వర్కులు కూడా చేపట్టని వైనం
- ఫ్లైఓవర్ అందుబాటులోకి రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు
- సర్వీస్ రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో తప్పని తిప్పలు

కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గంలోని జాతీయ రహదారిపై ఏర్పడ్డ గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని నెలలుగా రోడ్డు అధ్వానంగా ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. నియోజకవర్గంలోని చాదర్‌ఘాట్ చౌరస్తా నుంచి అంబర్‌పేట మీదుగా రామంతాపూర్, ఉప్పల్ వైపునకు వెళ్తున్న ఈ రహదారి నిర్వహణను రోడ్లు, భవనాల శాఖ చూస్తోంది. దీంతో జీహెచ్‌ఎంసీ ఈ రోడ్డు విషయంలో ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో గుంతలు పడ్డ రోడ్డుపై వాహనదారులు నిత్యం నరకాన్ని అనుభవిస్తున్నారు. ఈ రోడ్డుపై మరమ్మతులు చేపట్టడంలో అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

163 జాతీయ రహదారి

◆ వరంగల్ వెళ్లే 163 జాతీయ రహదారి అంబర్‌పేట, కాచిగూడ, చాదర్‌ఘాట్, కబేళా, గోల్నాక, తులసీనగర్, చే నంబర్ చౌరస్తా, అంబర్‌పేట గాం. దీబొమ్మ, బాపూనగర్ తదితర ప్రాంతాల మీదుగా రామంతాపూర్, ఉప్పల్ మీదుగా వెళ్తుంది. ఈ రహదారిలో ప్రతి రోజు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. నింబోలిఅడ్డ హిందూ శ్మశానవాటిక, అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తా, గోల్నాక చేనంబర్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అవరోధం కలుగుతోంది.


అంబర్‌పేట నుంచి విద్యానగర్ వైపు వెళ్లే రోడ్డు

నిలిచిపోతున్న ట్రాఫిక్...

◆ నగరంలోని అత్యంత రద్దీ కూడళ్లలో కాచిగూడ నింబోలిఅడ్డ చౌరస్తా, గోల్నాక చే నంబర్ చౌరస్తా, కాచిగూడ ఆర్టీసీ డిపో రోడ్డు సుందర్‌నగర్ బస్టాప్ చౌరస్తాలు ఉన్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ రద్దీ తీవ్రంగా ఉంటుంది. ఈ కారణంగానే అంబర్‌పేట, గోల్నాక చేనంబర్ చౌరస్తాలో ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టారు. పనులు పూర్తయినా ఇంకా ప్రారంభం కాకపోవడంతో స్థానిక ప్రజలతో పాటు వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. చౌరస్తాల్లో రోడ్డు గుంతలుగా మారడంతో గ్రీన్ సిగ్నల్ పడగానే వాహనాలు వేగంగా ముందుకు వెళ్లలేని పరిస్థితి ఎదురవుతోంది. వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో రోడ్డు గుంతల కారణంగా ట్రాఫిక్ స్తంభించిపోయి వాహనదారులు, స్థానికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

గుంతలమయంగా మారిన సర్వీస్ రోడ్డు

◆ అంబర్‌పేట చౌరస్తాలో ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయినా సర్వీస్ రోడ్డు పనులు మాత్రం అలాగే ఉంది. సర్వీస్ రోడ్డు మొత్తం గుంతలతో ప్రమాదకరంగా మారింది. సర్వీస్ రోడ్డు గుంతలో ఉండటంతో రోడ్డు కిరువైపులా ఉండే కాలనీలు, బస్తీల ప్రజలు, వాహనదారులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ఓవైపు గుంతలు పడ్డ రోడ్లతో ఇబ్బందులు పడుతుండగా మరోవైపు జాతీయ రాహదారికి ఇరువైపుల రోడ్లపై వాహనాలను అక్రమంగా పార్కింగ్ చేస్తుండటంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు.

బస్టాప్‌ల ముందే వాహనాల పార్కింగ్..

బస్టాప్‌ల ముందు వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో బస్సులను రోడ్లపైనే నిలపాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందిచి సర్వీస్ రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు. జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలకు ప్యాచ్‌వర్క్ చేపట్టి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.

దోపిడీ పాలన పోవాలంటే విప్లవం రావల్సిందే..

- లుథియానా యూనివర్సిటీ ప్రొఫెసర్ జగ్‌మోహన్ సింగ్
- వేడుకగా ఆర్‌ఎస్‌యూ పూర్వవిద్యార్థుల సమ్మేళనం


పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ జగ్‌మోహన్‌సింగ్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బీజేపీ పాలనలో దేశ ప్రజలకు మేలు జరగడంలేదని దోపిడీ హింస దౌర్జన్యాలే పెరిగిపోతున్నాయని లుథియానా యూనివర్సిటీ ప్రొఫెసర్ జగ్‌మోహన్‌సింగ్ విమర్శించారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాడికల్ స్టూడెంట్ యూనియన్ (ఆర్‌ఎస్‌యూ) 50 ఏళ్ల విద్యార్థి ఉద్యమ ప్రస్థానం పేరిట పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ జగ్‌మోహన్ సింగ్ మాట్లాడుతూ... దోపిడీ పాలన పోవాలంటే సమాజంలో విప్లవం రావల్సిందేనని అన్నారు. 1920లో దేశంలో ఎటువంటి ఆర్థిక సంక్షోభం ఉండేదో ఇప్పుడు కూడా అదే పరిస్థితి నెలకొందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో పోరాడి సాధించుకున్న హక్కులను కూడా నేటి పాలకులు హరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల మౌలిక హక్కులను కూడా కాలరాస్తుంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ... ప్రస్తుత సంక్షోభ కాలంలో మనుషులు మిగలడమే ఒక సవాల్‌గా మారిందన్నారు. ఈ పరిస్థితుల్లో 70, 80 కాలంనాటి విద్యార్థి పోరాటాలు సమాజానికి మార్గదర్శకం కావాలన్నారు. విప్లవోద్యమ విజయానికి విప్లవ విద్యార్థి ఉద్యమం అవసరమని దాని కోసమే రాడికల్ విద్యార్థి సంఘం ఏర్పడిందన్నారు. డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్ మాట్లాడుతూ... 70 ఏళ్ల క్రితం విద్యార్థులు ఉద్యమాలకు వచ్చేవారని నేడు ఆ పరిస్థితి లేదన్నారు. సమాజం మార్పు కోరేవారంతా ఏకతాటిపైకి రావాలన్నారు. ఫాసిస్టు విషకౌగిలి నుంచి ప్రజలను విముక్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జాతీయ నాయకులు బూర్గుల ప్రదీప్, రిటైర్డ్ ప్రొ. కాత్యాయని విద్మహే, ఆర్‌ఎస్‌యూ వ్యవస్థాపక సభ్యులు సీహెచ్ శివారెడ్డి, మాజీ అధ్యక్షులు సాంబమూర్తి, అరుణ, తుషార్‌కాంత్, తవ్వ లక్ష్మారెడ్డి, అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ మహిళలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి

జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి

కాచిగూడ: మహిళా బిల్లులో బీసీ మహిళలకు విద్యా,ఉద్యోగ,రాజకీయాల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించే విధంగా చట్టబద్ధత కల్పించాలని ఆయన అన్నారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు ప్రాతినిధ్యం కల్పించకపోతే మహిళా బిల్లుకు సార్థకత ఉండదన్నారు. రాజకీయ రిజర్వేషన్లు పెడితే 180మంది మహిళలు పార్లమెంట్‌లో సభ్యులవుతారని తెలిపారు. కానీ ఉద్యోగాలలో రిజర్వేషన్లు పెడితే కేంద్ర ప్రభుత్వంలోని 54 లక్షల ఉద్యోగాలలో 27లక్షల ఉద్యోగాలు, 29 రాష్ట్రాలలో కలిపి ఒక కోటి 80 లక్షల ఉద్యోగాలలో 90 లక్షల ఉద్యోగాలు మహిళలకు దక్కుతాయని పేర్కొన్నారు. మహిళల రక్షణ కోసం మరిన్ని చట్టాలు తేవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలను చైతన్యం చేస్తూ అధికారంలో వారికి వాటా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ప్రియాంకగాంధీ.. ఏమైంది మీ హామీ.?



కాచిగూడ: అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు విద్యార్థినులకు స్కూటీలు ఇవ్వాలని గురువారం పోస్టుకార్డు ఉద్యమాన్ని చేపట్టారు. గురువారం బర్కత్‌పురలోని రెడ్డి మహిళా కళాశాలలో విద్యార్థినులు స్కూటీలు అందజేయాలని ప్రియాంక గాంధీకి పోస్టుకార్డులు పంపించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి విద్యార్థినికి స్కూటీ ఇస్తామని సరూర్‌నగర్‌లో ప్రియాంకగాంధీ ప్రకటించారని గుర్తుచేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని తెలిపారు.

తెలంగాణ బార్ కౌన్సిల్‌కు శంకర్ రాజీనామా

కాచిగూడ: తెలంగాణ బార్ కౌన్సిల్ మెంబర్ బూరం శంకర్ తన బార్ కౌన్సిల్ మెంబర్ పదవికి గురువారం రాజీనామా చేశారు. ఈ మేరకు తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డికి తన రాజీనామా లేఖను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పాటైన తర్వాత రెండేళ్ల తెలంగాణ బార్ కౌన్సిల్‌కు ఎన్నికలు జరిగాయని అన్నారు. ఆ తర్వాత ఇంత వరకు ఎన్నికలు నిర్వహించలేదని తెలిపారు. ఇదే విషయమై తాను రెండు సార్లు బార్ కౌన్సిల్ చైర్మన్‌కు లేఖలు రాశానని తెలిపారు. అయినా ఎలాంటి స్పందన రాలేదన్నారు. ప్రస్తుత కమిటీని ఇంకా కొనసాగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. వెంటనే తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికలు జరపాలనే డిమాండ్‌తో తాను బార్ కౌన్సిల్ మెంబర్ పదవికి రాజీనామా చేసినట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రేవంత్‌రెడ్డి సర్కార్ 15 నెలలుగా సాగిస్తున్న పాలనలో తాను ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఆర్టీసీక్రాస్ రోడ్ మీదుగా ఇందిరాపార్కు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలంతా డప్పు వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ ర్యాలీగా తరలివెళ్లారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆయా ప్రాంతాలన్నీ ఎర్ర జెండాలతో రెపరెపలాడాయి. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు జీవీ చలపతిరావు, కేంద్ర కమిటీ సభ్యులు సాధినేని వెంకటేశ్వర్‌రావు, కె.గోవర్ధన్, వి.కోటేశ్వర్‌రావు, గాదె ఝాన్సీ, వి.సంధ్య, ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, మండల వెంకన్న, పీడీఎస్‌యూ జాతీయ నాయకులు పి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీగా తరలివెళ్తున్న సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

బడి ఈడు.. పట్టించుకునే వారెవరూ.?

- హోటళ్లు, దుకాణాల్లో పనిచేస్తున్న బాలలు
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు


సుందరయ్య విజ్ఞాన కేంద్రం సమీపంలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్న బాలలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బాలల హక్కుల కోసం ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా అవి సక్రమంగా అమలు కాకపోవడంతో బడి ఈడు పిల్లలంతా హోటళ్లు, కార్ఖానాలు, బేకరీలు, టీ కొట్లలో పనిచేయాల్సిన దుస్థితి ఏర్పడింది. అక్కడక్కడ అధికారులు చర్యలు తీసుకుంటున్నా కొంత మందిలో మార్పు రాకపోవడంతో బడికి వెళ్లాల్సిన చిన్నారులు బాలకార్మికులుగా మారుతున్నారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం పక్కనే ఇటీవల ప్రారంభమైన ఓ హోటల్‌లో గురువారం చిన్నారులు పనిచేస్తూ కనిపించడం అక్కడున్న వారిని విస్మయానికి గురిచేసింది. బాలల హక్కుల కోసం ఉద్యమిస్తున్న కమ్యూనిస్టు భవనం పక్కనే ఈ హోటల్ ఉండటం గమనార్హం. అదే సమయంలో బందోబస్తుకు వచ్చిన మహిళా కానిస్టేబుళ్లు కూడా అక్కడే టిఫిన్ చేశారు. కానీ ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం.


'ఇండియాలో ఇప్పుడేం చేయాలి?' పుస్తకావిష్కరణ



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రముఖ రచయిత, విద్యావేత్త సాధు మాల్యాద్రి రచించిన 'ఇండియాలో ఇప్పుడేం చేయాలి?'అనే పుస్తకాన్ని గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన పొలిటికల్ సెంటర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ... దేశంలో కార్మిక వర్గం అధికారంలోకి రావాలంటే మార్క్సిజమే మర్గమన్నారు. అంబేద్కర్‌ను అర్థం చేసుకోకుండా ఈ దేశంలో వర్గ పోరాటం విజయవంతం కాదన్నారు. భూమి హక్కుకోసం పోరాటం చేసినప్పుడే బహుజనులకు రాజ్యాధికారం వస్తుందన్నారు. వీసీకే తెలంగాణ అధ్యక్షుడు డా. జిలకర శ్రీనివాస్ మాట్లాడుతూ... బహుజనులకు రాజ్యాధికారం వచ్చినప్పుడే సామాజిక న్యాయం చేకూరుతుందన్నారు. అనాదిగా బహుజనులంతా పాలనకు దూరమయ్యారని అన్నారు. అణచివేత పీడనం పోవాలంటే ఐక్య ఉద్యమాలు నిర్మించాలన్నారు. ప్రముఖ దళిత నేత జేబీ రాజు మాట్లాడుతూ.. మారోజు వీరన్న సిద్ధాంతాలను ముందుకు తీసుకుపోయేందుకు ఈ పుస్తకం దోహదపడుతుందన్నారు. బుద్దిస్ట్ టి. సంజయ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దాసురాం నాయక్, నల్లా సూర్యప్రకాష్, బహుజన లెఫ్ట్ పార్టీ అధ్యక్షుడు దండి వెంకట్, జేవీ చలపతిరావు, వనం సుధాకర్, జి. రాములు, గాజుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో దామాషా ప్రకారం రిజర్వేషన్ ఇవ్వాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: స్థానిక ఎన్నికల్లో జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎంసీపీఐయూ వ్యవస్థాపకులు మద్దికాయల ఓంకార్ శతజయంతి వార్షికోత్సవాల సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాదగోని రవి మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ శాస్త్రీయంగా జరగాలని కోరారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 28న రాష్ట్రంలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీమీలేయర్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. బహుజన లెఫ్ట్ ఫ్రంట్ బలోపేతానికి ఉద్యమాలు నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్, ఉపెందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంసీపీఐయూ రాష్ట్రకార్యదర్శి గాదగోని రవి

వారానికోసారి చేనేత వస్త్రాలు ధరించాలి

- కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి
- ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో కో–ఆప్టెక్స్ షోరుమ్ ప్రారంభం
- హాజరైన తమిళనాడు మంత్రి ఆర్. గాంధీ, స్థానిక ప్రజాప్రతినిధులు


షోరూమ్‌ను ప్రారంభించి జ్యోతి వెలిగిస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, తమిళనాడు మంత్రి గాంధీ తదితరులు

చిక్కడపల్లి: దేశంలో ప్రతి ఒక్కరూ వారంలో ఒకరోజైనా చేనేత వస్త్రాలు ధరించాలని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి కోరారు. దేశంలో వ్యవసాయ రంగం తరువాత అత్యధిక కార్మికులు పనిచేస్తున్నది చేనేత రంగమని ఆయన చెప్పారు. దేశంలో వస్త్ర పరిశ్రమకు తమిళనాడు చాలా ప్రసిద్ధి అని తెలిపారు. తమిళనాడులోనే అనేక రకాల వస్త్రాలు తయారవుతాయని, ముఖ్యంగా హ్యాండీక్రాఫ్ట్, చేనేత వస్త్రాలను తయారు చేసి ప్రపంచంలోని అనేక దేశాలకు ఎగుమతి చేస్తామని వెల్లడించారు. చిక్కడపల్లిలోని ఆర్టీసీక్రాస్‌రోడ్డులో ఆధునీకరించిన కో–ఆప్టెక్స్ షోరూమ్‌ను గురువారం తమిళనాడు మంత్రి ఆర్ గాంధీ, మాజీ ఎంఎల్‌సీ ఎస్.రాంచందర్‌రావు, కార్పొరేటర్ పావనివినయ్ కుమార్‌లతో కలసి ఆయన ప్రారంభించారు. అనంతరం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... తమిళనాడులో లక్షలాది మంది కార్మికులు వస్త్ర పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. కో–ఆప్టెక్స్ ద్వారా అనేక రకాల అందమైన వస్తువులు తయారు చేసి అందజేస్తున్నారని తెలిపారు.

దేశవ్యాప్తంగా 150 కో–ఆప్టెక్స్ షోరూమ్‌లు ఉన్నాయి..

◆ ఈ సందర్భంగా తమిళనాడు మంత్రి ఆర్.గాంధీ మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా 150 కో–ఆప్‌టెక్స్ షోరూమ్‌లు ఉన్నాయని,104తమిళనాడులో, తెలంగాణలో 3 షోరూమ్‌లు ఉన్నాయని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు సంస్థ రూ.10కోట్ల నష్టాలలో ఉందన్నారు. తాను మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత అభివృద్ధి చేసి ప్రస్తుతం రూ.10కోట్ల లాభాలలో తీసుకొచ్చానని పేర్కొన్నారు. అన్ని ప్రాంతాలలో షోరూమ్‌లను రూ.30 - 40 లక్షలు వెచ్చించి ఆధునీకరించామని తెలిపారు. నాణ్యత ప్రమాణాలు ఏ మాత్రం తగ్గకుండా గ్యారంటీ కార్డు ఇస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ఒక రోజు ఉపయోగించి సంస్థకు అభివృద్ధి చెందడానికి సహకరించాలని కోరారు.

తక్కువ ధరలకు కొనుగోలు చేసే అవకాశం దక్కింది..

చిక్కడపల్లిలో కో–ఆప్టెక్స్ షోరూమ్ తరిగి ప్రారంభించడం అభినందనీయమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. పరిసర ప్రాంతాల వాసులకు చేనేత వస్త్రాలు తక్కువ ధరలకు కొనుగోలు చేసే అవకాశం దక్కిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహంకాళి సికింద్రాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గుండగోని భారత్‌గౌడ్, జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, నేతలు మద్దూరి శివాజీ, శ్రీకాంత్, అరుణ్, ఆనంద్, బీఆర్‌ఎస్ నేతల రాకేష్ కుమార్, పున్నసత్యనారాయణ, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220383